సాక్షి ప్రకాశం
సోమవారం, 29, జూలై, 2024



తిరునాళ్ల వైభవం

కొత్తపట్నం గ్రామంలో నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరునాళ్ల మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు.

- 8లో..



అప్పులు తప్ప ఏపీకి ఇచ్చిందేమీ లేదు

ఎన్డీయేకు మద్దతు తెలుపుతున్న బీహార్‌కు నిధులు. ఏపీకి అప్పులు అంటగట్టడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ విమర్శించారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి అండర్ 7 చెస్ విజేతలు వీరే



పోటీలకు ఎంపికైన చిన్నారులు

ఒంగోలు: జిల్లా స్థాయి అండర్ 7 చెస్ విజేతల వివరాలను ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ నబీ ఆదివారం మీడియాకు విడుదల చేశారు. స్థానిక ఐకాన్ పబ్లిక్ స్కూలులో నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో జె.విష్ణుష్ గుప్తా, సీహెచ్ శ్రీరుద్ర సిరిగిరి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, బాలికల విభాగంలో సుదీక్ష, సీహెచ్ నీహారిక మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వీరు ఆగస్టు 3, 4 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 7 చాంపియన్‌షిప్ 224కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు.

సచివాలయ ఏఎన్‌ఎంలకు పదోన్నతి కల్పించాలి



మహా సభలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న వివిధ కేడర్ల ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో ఆదివారం యూనియన్ జిల్లా కమిటీ 7వ మహాసభలు నిర్వహించారు. రెగ్యులర్ ఉద్యోగస్తులందరికీ ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుభాషిణి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఏఎన్‌ఎంలను గ్రేడ్-2 గా పదోన్నతులు కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవలను అందించే ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతి మీద తీసుకోవడం సరైన విధానం కాదని, రెగ్యులర్ ప్రతిపాదిక మీదనే వారిని నియమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు సూచించారు. ఈ సభలో అప్పలరాజు, జి.నాగేశ్వరరావు, కె.శ్రీధర్ బాబు ప్రసంగించారు. అనంతరం రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో వై.సురేష్ బాబు, జె.వెంకటేశ్వరరెడ్డి, భరత్ భూషణ్, రమణ మూర్తి, ధనలక్ష్మి, జయ కుమారి, అంజనీ దేవి, శారద, కృష్ణ కుమారి, మంత్రు నాయక్, వెంకట్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భాగవత ప్రవచనం

- బమ్మెర పోతన పద్యాలతో సభికులను రంజింపజేసిన అగస్త్య రాజు



భక్త ప్రహ్లాద ప్రవచనంలో అగస్త్యరాజు శివ

ఒంగోలు మెట్రో: పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డులో జరుగుతున్న భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా రెండో రోజు ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రముఖ జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి, అగస్త్య రాజు శివ "భక్త ప్రహ్లాద" ప్రవచనం చేశారు. భాగవతం సప్తమ స్కందంలో భక్త ప్రహ్లాద చరిత్ర ఘట్టంపై మాట్లాడారు. బమ్మెర పోతన పద్యాల ఆలాపనతో తాత్పర్యాలతో శ్రోతలకు వివరిస్తూ అగస్త్యరాజు శివ సభికులను రంజింప చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మాగుంట శ్రీరామ మూర్తి, పద్య సారస్వత పరిషత్ అధ్యక్షుడు చదలవాడ నరసింహారావు, కార్యదర్శి పింగళి పూర్ణచందర్రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంభంలో రథయాత్ర

కంభం: హరేక్రిష్ణ బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టాభిరామాలయం నుంచి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు జగన్నాథ్ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చనలు, పుష్పాభిషేకం, పల్లకి ఉత్సవం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రథయాత్రలో భక్తులు

నల్లమల.. పులి గర్జన



చూపులో రాజసం.. నడకలో ఠీవీ.. గాండ్రిస్తే అడవంతా దద్దరిల్లే శబ్దం. అడవిలో అన్ని జంతువులకు వీటి కదలికలు చూస్తేనే భయం. పులులకు సంరక్షణ కేంద్రంగా నల్లమల ఖ్యాతి గాంచింది. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో అటవీశాఖ తీసుకుంటున్న చర్యలతో వీటి సంతతి ఏటా పెరుగుతూ వస్తోంది. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- నల్లమలలో 85కుపైగా పెద్ద పులులు
- 55 ఆడ.. 30 మగ పులులు
- 85 బేస్ క్యాంపుల ఏర్పాటు
- 425కుపైగా చిరుతలు
- పులుల సంరక్షణలో వెయ్యి మంది సిబ్బంది
- నల్లమల టూ శేషాచలం టైగర్ కారిడార్
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

మార్కాపురం:

నల్లమల పరిధి పెరిగిపోతోంది. గతంలో ఏపీలోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్గొండ తదితర జిల్లాలతో అనుసంధానంగా ఉండేది. తర్వాత శేషాచలం అడవులను కలుపుతూ ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు) టైగర్ కారిడార్ ఏర్పాటైంది. నల్లమల అడవిలోని పెద్ద పులులు ఎక్కువగా కడప మీదుగా వనిపెంట, ఒంటిమిట్ట తదితర ప్రాంతాల్లో ఉన్న శేషాచలం అడవుల్లో కూడా సంచరిస్తున్నాయి. దీంతో నల్లమల పరిధి 8 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 16 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలో 85కుపైగా పెద్దపులులు, సుమారు 425 చిరుత పులులు ఉన్నాయి. ప్రస్తుతం పులుల సంతతి పెరుగుతుండటంతో తమ ఆవాసాన్ని విస్తరించుకుంటున్నాయి. నల్లమల నుంచి పొరుగు జిల్లాల వైపు వెళ్తున్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే శేషాచలం అడవులవైపు సైతం పయనమవుతున్నట్టు అధికారులు తెలిపారు.

పూర్తయిన గణన...

మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, గుంటూరు జిల్లాలోని విజయపురిసౌత్ రేంజ్‌లు ఉండగా, గిద్దలూరు అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి, ఒంగోలు ఉన్నాయి. నల్లమలలో 2022లో దాదాపు 73 పెద్ద పులులు ఉండగా, గతేడాది ఈ సంఖ్య 80కి పెరిగింది. ఈ సంవత్సరం 85కిపైగా చేరింది. ప్రస్తుతం నల్లమలలో 55 ఆడ, 30 మగ పెద్ద పులులు ఉన్నట్లు అంచనా వేశారు. వీటితో పాటు 425కుపైగా చిరుతలు ఉన్నాయి. పులుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలతో వీటి సంఖ్య భారీగా పెరిగింది. ఇటీవలే పులుల గణన పూర్తయింది. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా వీటి సంఖ్యను అధికారికంగా ప్రకటించనున్నారు.

సంరక్షణకు ప్రత్యేక చర్యలు...

నల్లమలలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుమారు వెయ్యి మంది సిబ్బంది, 85 బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. త్వరలో నూతన సిబ్బందిని కూడా నియమించనున్నారు. వీరు నిరంతరం అడవిలో తిరుగుతూ పులుల సంరక్షణపై దృష్టి పెడతారు. పులుల కదలికలను ట్రాక్ చేస్తారు. సీసీ కెమెరాల ద్వారా పెద్దపులుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఉన్నత స్థాయిలో సెక్షన్ ఆఫీసర్, ఆపైన సబ్ డీఎఫ్‌ఓలు, డిప్యూటీ డైరెక్టర్లు, సిబ్బందితో పాటు అడవిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ప్రతిరోజూ అడవిలో ఏం జరుగుతుంది, జంతువుల కదలికలపై సమాచారం సేకరిస్తారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, నారుతడికల, పాలుట్ల, ఇష్టకామేశ్వరి, దొరబైలు, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, చినమంతనాల, రోళ్లపెంట, కొర్రపోలు, తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో అటవీశాఖ సిబ్బంది ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక రాత్రిపూట శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను దోర్నాల చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 గంటలకే నిలిపేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను కూడా ఈగలపెంట వద్ద అక్కడి చెక్‌పోస్టు సిబ్బంది 9 గంటలకు నిలిపేస్తున్నారు. ఇలా చేయటం వలన రాత్రిపూట పెద్దపులులు, చిరుత పులులు, జింకలు, రేసుకుక్కలు, తదితర అటవీ జంతువులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. రాత్రి సమయంలో అడవి జంతువులు వచ్చి దాహం తీర్చుకుంటాయి. నల్లమల అటవీ ప్రాంతంలో సహజ కుంటల్లో వేసవిలో కూడా ఇక్కడ నీరు ఉండటం విశేషం. దీంతో అడవి జంతువులు ఇక్కడికి వచ్చి సేద తీరుతుంటాయి. ప్రధానంగా వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడవిలో ఉన్న సాసర్ పిట్లను నీటితో నింపి నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నారు.



సాసర్‌పిట్‌లో నీరు తాగేందుకు వచ్చిన పెద్దపులి



అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులులు



అడవిలో ట్రాప్‌కెమెరాలో రికార్డయిన పెద్దపులి

ప్రత్యేక రక్షణ చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. వన్యప్రాణులు సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఇందులో భాగంగా 85 బేస్‌క్యాంపులు, వెయ్యి మంది సిబ్బందిని నియమించాం. త్వరలో మరికొంత మంది సిబ్బందిని కూడా నియమిస్తున్నాం. జనావాసాల్లోకి రాకుండా ఉండేందుకు వివిధ ప్రాంతాల్లో సాసర్‌పిట్లు ఏర్పాటు చేశాం. వన్య ప్రాణుల సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

– విఘ్నేష్ అప్పావు, డిప్యూటీ డైరెక్టర్, మార్కాపురం

రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే మొత్తంగా ఒక ఆటవిక, అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా మరో మూడు నెలలపాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని ఆమోదించలేమని, రాష్ట్ర చరిత్రలో 7 నెలలపాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్లడం బహుశా ఇదే తొలిసారి అయి ఉంటుందన్నారు. చంద్రబాబు రాజకీయాలు అయినా, పాలన అయినా అంతా వెనుక నుంచే చేస్తారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ధ్వంసం అయిపోయిందని కథ ప్రారంభించారని, ఎన్నికల సమయంలో రూ.14 లక్షల కోట్లు అప్పులు అంటూ ఊదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చాక చూస్తే ఆ సంఖ్య కనిపించడంలేదన్నారు. దీంతో గవర్నర్ ప్రసంగం సమయానికి రూ.10 లక్షల కోట్లకు తగ్గించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఖజానాలో ఉన్నా పూర్తిస్థాయి బడ్జెట్‌ను జూలై 5న ప్రవేశపెట్టి డీబీటీ ద్వారా పేదల ఖాతాల్లో రూ.2.71 లక్షల కోట్లు ఇచ్చిన ఘనత తమది అన్నారు. 2019లో మాదిరి కష్టాలను తాము ఈ ప్రభుత్వానికి ఇవ్వలేదని, ఖజానాలో ఏకంగా రూ.7 వేల నుంచి రూ.8 వేల కోట్లు ఉన్నాయన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే సూపర్ సిక్స్‌కు కచ్చితంగా ఎంత ఖర్చవుతుందో చెప్పాల్సి ఉంటుందని, అందుకే ఎన్నికల్లో తాను చేసిన మోసపూరిత హామీలను అమలు చేయలేని పరిస్థితిలో ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అన్న భయం చంద్రబాబును వెన్నాడుతోందన్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ చంద్రబాబు, లోకేష్ ఆదేశాల మేరకు దాడులు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. కేవలం 50 రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించారని విమర్శించారు. అమ్మ ఒడి పేరు మార్చి తల్లికి వందనం అంటూనే దానిని ఎప్పుడు ఇస్తారో చెప్పకుండా శాసనమండలిలో మాత్రం వచ్చే సంవత్సరం నుంచి అని ప్రకటించడం ద్వారా అమ్మ ఒడికి సున్నా పెట్టారన్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా రైతు భరోసా అందలేదని, ఉచిత పంటల బీమా ప్రీమియం కూడా చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలన్నీ ఠంచనుగా అందేవని ప్రజల్లో చర్చ నడుస్తోందని చెప్పారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడంలేదన్నారు. మత్స్యకార భరోసా, పోలవరం ఇలా అన్నింటిని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మద్యం మీద చంద్రబాబు చెప్పిన శ్వేతపత్రం పచ్చి అబద్ధం అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణంలో విక్రయించిన బ్రాండ్లన్నీ చంద్రబాబు ప్రభుత్వంలో ఇచ్చిన లైసెన్స్‌లే అన్నారు. ఇప్పుడు అమరావతి ఎప్పుడు కడతారు, ట్రూ అప్ కరెంటు చార్జీలు ఎప్పుడు తగ్గిస్తావు, ఉచితం అని ఇంత అధిక ధరకు ఇసుక విక్రయించడం ఏమిటి అని ప్రశ్నించినా నోరు మెదపడంలేదన్నారు. చివరకు వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని నేడు రోడ్డున పడేయడమేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు.



జంకె వెంకటరెడ్డి

విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మోజు శ్రీనివాసరావు

ఒంగోలు: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలని, ఉన్నత పాఠశాలల్లో రెండు మాధ్యమాలు సమాంతరంగా కొనసాగించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరుతున్నామన్నారు. దీని కోసం దశలవారీగా కార్యాచరణ ప్రారంభించి కలెక్టర్, డీఈవో, మండల తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు వినతిపత్రాలు అందించాలన్నారు. ఆగస్టు 5 నుంచి 15 వరకు ఎంఎల్‌ఏలకు, 20 నుంచి 30 వరకు మంత్రులకు, సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్టు కార్డులు పంపించాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎస్.చిన్నస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యదర్శులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉన్నారు.

ఆణిముత్యాలు అటకెక్కినట్టేనా..?

- పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించిన జగన్ సర్కార్
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బహుమతులు
- ఈ ఏడాది ఇంతవరకూ విడుదల కాని మార్గదర్శకాలు
- కూటమి ప్రభుత్వం పథకం అమలు చేస్తుందా..లేదా అన్న సందేహాలు

బేస్తవారిపేట: ప్రతి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పాఠశాలల రూపు రేఖలను మార్చేసింది. అంతే కాకుండా ప్రభుత్వ బడుల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహక బహుమతులు అందించి సత్కరించింది. అయితే ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గత విద్యా సంవత్సరం (2023-24)లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు లేనట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వివిధ స్థాయిల్లో ప్రోత్సాహకాలు:

ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగు పరచి వారిని ప్రోత్సహించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల వారీగా ఎంపిక చేసి నగదు బహుమతులు అందించారు. పదో తరగతితో పాటు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ వంటి గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందించారు. పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.లక్ష, రెండో స్థానానికి రూ.75 వేలు, మూడో స్థానానికి రూ.50 వేలు అందించారు. ఇంటర్మీడియెట్‌లో గ్రూపునకు ఒక్కరు చొప్పున ప్రతిభ చాటిన వారికి రూ.లక్ష అందించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు, రెండో స్థానానికి రూ.30 వేలు, మూడో స్థానానికి రూ.15 వేలు అందించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గ్రూపునకు ఒక్కరు చొప్పున ప్రతిభ చాటిన వారికి ఒక్కొక్కరికి రూ.50 వేలు అందించి ప్రోత్సహించారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు ప్రోత్సాహకంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. పాఠశాల స్థాయిలో మొదటి ముగ్గురు టాపర్స్‌గా నిలిచిన వారికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 అందించారు.

ఈ ఏడాది ప్రోత్సాహకాలు లేనట్టే...

ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడానికి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం ప్రోత్సాహక బహుమతులు లేనట్టేనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రోత్సాహక బహుమతులు అందిస్తే విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారిలో మనోధైర్యం కల్పించిన వారవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

2022-23లో జిల్లా స్థాయిలో 27 మంది, నియోజకవర్గ స్థాయిలో 42 మంది, పాఠశాల స్థాయిలో 600 మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కూటమి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు పెంచి పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ దివస్



కార్గిల్ విజయ్‌దివస్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



హాజరైన మాజీ సైనికులు

ఒంగోలు: కార్గిల్ దివస్ ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఘనంగా జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్నల్ పీఎస్ రెడ్డి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారతీయ సైనికులు చూపిన వీరోచిత పోరాటాన్ని వివరించారు. మంచి జీవితానికి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరే విధానం, సైనికుల కష్టాల గురించి వివరించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రజనీకుమారి మాట్లాడుతూ తాను స్వయంగా రాసిన పాటను పాడి సైనికులకు నివాళులర్పించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్గిల్‌లో 1.25 లక్షల మంది జనాభా ఉంటారని, 14086 చదరపు కిలోమీటర్ల దూరంలో 16 వేల నుంచి 18 వేల అడుగుల ఎత్తులో నివశిస్తుంటారన్నారు. ఇది కేవలం శ్రీనగర్‌కు 20.50 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని సంధి చర్చలు జరుగుతున్న సమయంలో బంకర్లు ఏర్పాటు చేసుకుని టైగర్ హిల్ పక్కన ఉన్న రహదారికి అంతరాయం కలుగజేస్తూ శ్రీనగర్‌ను ఇండియా నుంచి తొలగించాలని పాకిస్తాన్ కుట్రపన్నిందన్నారు. ఒక పశువుల కాపరి ఇచ్చిన సమాచారం ద్వారా భారతీయ సైన్యం వీరోచితంగా పోరాడి పాకిస్తానీయులను పారదోలిందని, కానీ ఈ పోరాటంలో ఎంతోమంది జవానులు అమరులయ్యారన్నారు. సైనికుల త్యాగాలు స్మరించుకుంటూ ఏటా కార్గిల్ దివస్ జరుపుకుంటామంటూ కార్గిల్ దివస్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సమావేశంలో మాజీ సైనికుల సంఘం ప్రతినిధులు ఆలపాటి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకట్రావు, దర్శి కోటేశ్వరరావు, బొడ్డపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రజక వృత్తిదారుల హామీలు నెరవేర్చాలి



రజక వృత్తిదారుల కమిటీ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న మాలకొండయ్య

ఒంగోలు టౌన్: ఎన్నికలకు ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్బీజీ భవన్‌లో ఆదివారం సంఘ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు పట్టణంలోని అపార్ట్‌మెంట్‌ల్లో వాచ్మెన్ కం ఇస్త్రీదారులుగా అనేక మంది రజకులు చాలిచాలనీ జీతాలతో బతుకుబండిని నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్‌ల్లో ఇంటి పనులు చేస్తూ ఇరుకు ఇళ్లల్లో బతుకుతున్నారన్నారు. అనేక మంది యువతీ యువకులు ఉపాధిలేక పట్టణాలకు వలసల పోయి కష్టాలు పడుతున్నారని, ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన రజకులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవలమంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య , పోలయ్య, యోగమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

కుక్కలదాడిలో 50 గొర్రెపిల్లలు మృతి

గిద్దలూరురూరల్: స్థానిక కొంగలవీడు రోడ్డులో ఆదివారం వీధికుక్కలు స్వైరవిహారం చేయడంతో 50 గొర్రెలు మృతి చెందాయి. 50 గొర్రెపిల్లలు మృతిచెందడంతో తీవ్రంగా నష్టపోయాయని నష్టపరిహారం ఇప్పించాలని బాధితరైతు మునిరాజు వాపోయాడు.



మృతి చెందిన గొర్రెపిల్లలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కేశవరాజుకుంట చెరువులో తేలియాడుతున్న మృతదేహం

ఒంగోలు టౌన్: నగరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగర శివారులోని కేశవరాజు కుంటకు వెళ్లే దారిలోని చెరువులో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్న తాలుకా ఎస్సై కోటయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 36 ఏళ్ల వరకు ఉంటుంది. మృతదేహం ఉబ్బి ఉంది. దీంతో మూడు రోజుల క్రితమే మరణించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఎవరైనా హత్య చేసి ఇక్కడకు తెచ్చి పడేశారా లేక ఆత్మహత్య చేసుకొని మరణించాడా అనేది తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా సౌత్ బైపాస్ వద్ద ఉన్న ఒక విల్లాస్ వద్ద గత గురువారం గుర్తు తెలియని ఒక వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల వ్యవధిలోనే మరో మృతదేహం కనిపించడంతో చర్చనీయాంశంగా మారింది.



గదుల్లో పెచ్చులూడి పడుతున్న పైకప్పు



అధ్వానంగా ఉన్న హాస్టల్ పరిసరాలు



తలుపులు పాడైపోయిన మరుగుదొడ్లు

సమస్యలు ఇలా.. చదివేదెలా..?

- కంభం ఎస్సీ బాలికల హాస్టల్లో కనీస వసతులు కరువు
- అధ్వానంగా పారిశుధ్యం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- మంచినీటి సరఫరాకు సైతం అంతరాయం
- భోజనం బాగలేదంటున్న తల్లిదండ్రులు
- అయినా పట్టించుకోని అధికారులు

కంభం:

కంభం ఎస్సీ బాలికల వసతి గృహం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఓ వైపు శిథిలావస్థకు చేరిన గదులు, మరోవైపు అరకొర సౌకర్యాలతో పాటు పారిశుధ్యం అధ్వానంగా మారడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు తగినట్లు వసతులు లేకపోవడంతో ఆడపిల్లలు అవస్థపడుతున్నారు.

హాస్టల్లో 170 మంది విద్యార్థినులు...

కంభంలోని రంగరాజు హైస్కూల్ పక్కనున్న కంభం ఎస్సీ బాలికల హాస్టల్లో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థినులు 170 మంది ఉన్నారు. వీరంతా రంగరాజు ఎయిడెడ్ స్కూల్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదువుకుంటూ హాస్టల్లో ఉంటున్నారు. కానీ, హాస్టల్లో విద్యార్థినుల సంఖ్యకు సరిపడా వసతులు లేవు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండగా, వాటికి తలుపులు కూడా సరిగ్గా లేవు. గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వర్షాలు పడితే గదుల గోడల చుట్టూ నీటి చెమ్మ చేరుతుంది. శ్లాబుల పెచ్చులూడి పడుతుండటంతో నిత్యం భయంభయంగా విద్యార్థినులు గడుపుతున్నారు. పెద్ద వర్షం పడితే గదుల్లో నిద్రపోలేని పరిస్థితి. ఆ సమయంలో ఆఫీసు రూము, ఇతర గదుల్లో నిద్రించాల్సి వస్తోందని చెబుతున్నారు. విద్యార్థినులకు హాస్టల్లో కనీసం మినరల్ వాటర్ కూడా అందుబాటులో లేదు. రోజూ బోరు నీరు తాగుతున్నామని విద్యార్థినులు చెబుతున్నారు. భోజనం బాగుండటం లేదని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు.

35 ఏళ్ల నాటి భవనం...

ఎస్సీ బాలికల హాస్టల్ నిర్వహిస్తున్న భవనం సుమారు 35 సంవత్సరాల క్రితం నిర్మించినది కావడంతో నాలుగైదు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయో అర్థంకాని పరిస్థితిలో ఉన్నాయి. ఆ గదుల్లోనే విద్యార్థినులు భయపడుతూ రాత్రిపూట నిద్రిస్తున్నారు. రెండో వైపు ఉన్న గదులు పెచ్చులూడుతున్నాయి. వరండాలో సైతం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదభరితంగా ఉంది. మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరి తలుపులు కూడా లేకుండా అధ్వానంగా ఉన్నాయి. వంట గది కారుతుండటంతో వర్షం వేళ వంటచేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



హాస్టల్లో ఉంటున్న విద్యార్థినులు

భోజనం బాగుండటం లేదు



నా ఇద్దరు కుమార్తెలు కంభం హాస్టల్లోనే ఉంటూ చదువుకుంటున్నారు. ఒక అమ్మాయి పదో తరగతి, ఇంకో అమ్మాయి 8వ తరగతి చదువుతోంది. మా ఊరికి చెందిన పది మంది పిల్లలు ఇక్కడే ఉంటున్నారు. హాస్టల్లో భోజనం బాగాలేదని తరచూ పిల్లలు చెబుతున్నారు. అదే విషయాన్ని అధికారులకు చెప్పేందుకు భయపడుతున్నారు. అధికారులే స్పందించి తగిన చర్యలు తీసుకుని మంచి ఆహారం అందించాలి.

చిన్నపోలయ్య, విద్యార్థిని తండ్రి, పెద్దారవీడు మండలం

హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి



కంభం హాస్టల్లో నా కుమార్తె ఉంటూ 6వ తరగతి చదువుతోంది. హాస్టల్లో భోజనం, సౌకర్యాలు బాగలేకపోవడంతో ఆరోగ్యంపై ఆందోళనగా ఉంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వసతులు, భోజనం నాణ్యత మెరుగుపరచాలి.

పద్మ, విద్యార్థిని తల్లి, పుల్లలచెరువు

డ్రైనేజీ నీరు వెళ్లే మార్గం లేదు

హాస్టల్లో 170 మంది విద్యార్థినులు ఉన్నారు. చుట్టూ ప్రహరీ ఉండటంతో హాస్టల్లోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేదు. లోపలే ఓ వైపు ఉన్న గుంతలో నిలిచిపోతోంది. దీంతో కొంత ఇబ్బంది కలుగుతోంది.

– కె.హేమలత, హాస్టల్ వార్డెన్

ఎస్టిమేషన్ వేసి పంపిస్తాం

హాస్టల్లో ఓ వైపు ఉన్న గదులు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఇతర గదులకు మరమ్మతులు అవసరం. హాస్టల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– రమణ, డీఈ, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ

మురుగునీరంతా లోపలే...

హాస్టల్లోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో లోపలే నిల్వ ఉంటోంది. చుట్టూ ప్రహరీ ఉండటం, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా ఎక్కడికక్కడే నిలిచిపోయి దోమల వ్యాప్తి పెరిగిపోతోంది. చెత్తాచెదారం, వ్యర్థాలను సైతం టాయిలెట్ల వెనుకవైపునే పడేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మంచి నీటి బోరు పక్కనే మురికినీరు ఇంకిపోతుండటంతో బోరు నీరు చెడిపోయే అవకాశం ఉంది. వర్షం పడితే హాస్టల్ పరిసరాలు మరింత అధ్వానంగా మారిపోతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో హాస్టల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్లోని సమస్యలన్నీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కంభం ఎస్సీ బాలికల హాస్టల్



హాస్టల్లో ఓ వైపు నిల్వ ఉన్న మురుగునీరు



శిథిలావస్థకు చేరిన వంటగది



హాస్టల్లో ఓ వైపు పూర్తిగా శిథిలావస్థకు చేరిన గదులు

తిరునాళ్ల వైభవం



భారీగా తరలివచ్చిన భక్తులతో జనసంద్రాన్ని తలపిస్తున్న ఆలయ పరిసరాలు

కొత్తపట్నంలో నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కొత్తపట్నం, చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జనంతో కిక్కిరిసాయి. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరునాళ్లు, ప్రత్యేక ఘట్టాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

– కొత్తపట్నం



కుంకుమ బండ్ల ఊరేగింపు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



సిరిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు



సిరిమానులో ఉంచిన మేకపోతు

అప్పులు తప్ప ఏపీకి ఇచ్చిందేమీ లేదు

- బీహార్‌కు భారీగా సాయం చేసి ఏపికి అప్పులివ్వడమేంటని ప్రశ్న
- కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన



సాగర్ హోటల్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నేతలు

ఒంగోలు టౌన్: ఎన్డీఏకు మద్దతు ఇస్తున్న బీహార్‌కు భారీగా నిధులు కేటాయించి ఏపీకి మాత్రం అప్పులను అంటగట్టడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ, ప్రకాశం జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సాగర్ హోటల్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ఏపీకి అప్పులు తప్ప ఎలాంటి గ్రాంట్ ఇవ్వలేదని, ఇది ఏపీ ప్రజలను మభ్యపెట్టడమేనని మండిపడ్డారు. అమరావతికి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు ఇస్తామని చెప్పారు తప్ప గ్రాంట్ ఇవ్వడానికి బడ్జెట్లో ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి గ్రాంట్లు ఇవ్వాలని, అప్పులు ఇచ్చి రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టవద్దని సూచించారు. రాష్ట్రానికి నిధులు తీసుకొని రావడంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. సామాన్యులకు లబ్ధి చేకూరకుండా సంక్షేమ పథకాలలో అనేక కోతలు విధించారని, ఉపాధి హామీ పథకం నిధుల్లో కోత విధించి గ్రామీణ ప్రాంత ప్రజల ఉపాధిని దెబ్బ తీశారని, ఆహార సబ్సిడీలపై కోతలు విధించి పేదల కడుపులు కొట్టారని వివరించారు. కార్పొరేట్ శక్తులకు, సంపన్నులకు మాత్రమే ఉపయోగపడే ఈ బడ్జెట్ వల్ల నిరుపేద ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని తేల్చిచెప్పారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాల జాబితాలో చేర్చినట్లు చెప్పడమే కానీ నిధుల విషయంలో ఏమీ చెప్పలేదని, ఈ రోజుకి కూడా జిల్లా ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా ఇవ్వడం ఒక్కటే పరిష్కారమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి స్పష్టం చేశారు. అరకొర నిధులతో రాష్ట్రం అభివృద్ధి చెందడం ఒట్టి భ్రమ మాత్రమేనన్నారు. శ్వేతపత్రాల సాకులు చూపి ప్రజలపై పన్నులు వేస్తే సహించేదిలేదని ఎస్కే మాబు చెప్పారు. నిరసనలో కంకణాల ఆంజనేయులు, నీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాచర్ల: చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని చినగానిపల్లె గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చినగానిపల్లె గ్రామానికి చెందిన కైప వీరనారాయణరెడ్డి (57) అనే వ్యక్తి బతుకుదెరువు నిమిత్తం గుంటూరుకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈ నెల 23వ తేదీ చినగానిపల్లె గ్రామంలోని అల్లుడు నివాసానికి వచ్చాడు. మూడు రోజుల పాటు అల్లుడు వద్దనే ఉండి 26 తేదీ శుక్రవారం ఇంటి నుంచి గుంటూరుకు వెళుతున్నానని చెప్పి వెళ్లి 27వ తేదీన శనివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వెళ్లి తిరుగు ప్రయాణంలో చినగానిపల్లె, జేపీ చెరువు గ్రామాల మార్గమధ్యంలో వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఐదేళ్లుగా మద్యానికి బానిస కావడంతో తన భార్య పిల్లల వద్దకు వెళ్లకుండా అక్కడక్కడ ఉంటే బంధువులు దగ్గర తిరుగుతూ కాలం గడుపుతున్నాడు. మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఎస్సై ఇమ్మానియేల్ పర్యవేక్షణలో ఏఎస్సై ఆదిశేషయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.